దివాస్వప్నం

# ఆనందం : సారిక

గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

ఆనందం కళాసమాధిలో కూచున్నాడు. అతని అధరాల అరుణరుచుల కొనల్లో మందహాసం వయ్యారంగా నృత్యం చేస్తోంది.

"సంపూర్ణత" అన్నాడతను తీవ్రంగా.

"సమైక్యత"—మృదువుగా.

"సంతోషం"—ఆనందంగా.

అతను నవ్వాడు. విరగబడి నవ్వాడు. పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వాడు.

అతను ఏడ్చాడు. సరసంగా ఏడ్చాడు. తనివి తీరా ఏడ్చాడు.

ఆనందరావు పొడుగువేళ్లు అతి నేర్పుతో సాగుతున్నాయి. అతని ఆరితేరిన హస్తాల పనితనం ఫలితమే ఆ చక్కని రాతిబొమ్మ.

అతను అలా కళా సమాధిలో కూచుంటే శిల్ప సంపదంతా పరిపక్వమై అతని చేతుల్లోంచి పళ్ళగుత్తుల్లాగా వరసగా తయారయినాయి.

ఆనందరావు రోజూ ప్రొద్దున్నే రాధాకృష్ణుల సందర్శనం చేసుకునేవాడు.

రాధాకృష్ణ! ఆ కళా వైభవం! రోజుకొక కాంతీ, రోజుకొక వెలుగూ, రోజుకొక క్రొత్త ప్రభా. తీయగాతీయగా రాగం అంటూరు అందుకే కాబోలు!

రాధాకృష్ణుల నాట్యభంగిమ తన మనోవృక్షాగ్రాన పండిన తొలి ఫలం, తన శిల్పప్రసూనంలో తొలి దళం.

తరువాత మురళి వాయించే కృష్ణయ్యా, తరవాత ఛత్రపతి శివాజీ, తరవాత అభిసారిక.

అభిసారికదగ్గర ఆగాడు. తల ఓరగా వొంచి, చిరునవ్వుతో వీక్షించాడు. అభిసారిక తన పొంగిపొర్లే నగ్న సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ ఇసకతిన్నె మీద మలయమారుతాలు హృదయానికి సోకి కలిగించిన తియ్యని బాధతో ప్రియునికోసం వేచి ఉంది. అతను వివశుడైపోయాడు. అభిసారిక అందించే ఆహ్వానాన్ని అందుకుందామా అనిపించింది ఆనందరావుకు.

"ఇదేనట్రా నీ శిల్పం? ఆడది మగవాడికోసం ఎదురు చూడటమేనా శిల్పం?" ఫుల్లం పిన్ని మాటలు జ్ఞప్తికి వొచ్చాయి.

ఆనందానికి సందేహంకలిగింది. కిటికీలోనుంచి వెనక్కి చూశాడు.

ఫలభరితమైన వృక్షాగ్రం...చిలకా, గోరింకా పురుషుడూ ప్రకృతి...అది అపార ప్రేమాంబుధి.

తను స్రష్ట. సృష్టిలో అవినీతిలేదు.

ఆనందరావు ముందుకుసాగాడు. కూచున్నాడు. ఏదో మనసుకు గోచరించిన ప్రతిమను చెక్కుదామని. తన స్వప్న సుందరికి జీవం పోద్దామని.

కాని భావతరంగాలకు ఏదో అడ్డుపడ్డది. అర్ధనిమీలిత నేత్రాలు లేడికన్నుల చాంచల్యాన్ని కోల్పోయి కనిపించని ఒకానొక అగోచర సత్యం మీద నిలిచిపోయినై. అతని చేతులు కదలక మెదలక, ఆ రాతిమీద నిలిచిఉన్నై.

వెనకాల ఎవరివో పాదాల అలికిడి అతనిలో చైతన్యాన్ని తేలేదు. ఆ శబ్దం నిశ్శబ్దంగా ముందుకు సాగి అతని ఎదట సాక్షాత్కరించినది.

అతనిలో ఆనందవాహిని పెల్లుబికింది. అతనిలో ఎక్కడలేని చైతన్యం వొచ్చింది. అతను లేచి ఆ విగ్రహాన్ని సమీపించాడు.

ఆ అపూర్వ కళాసృష్టిని కళ్లారా చూచాడు. ఆ రూపొందిన మార్దవాన్ని చేతులారా స్పృశించాడు. ఆ అవిరళ పరిమళాలను తనివి తీరా ఆఘ్రాణించాడు.

"స్వామీ" ఆ లలన కంఠస్వనంలో అపహరింపబడిన కోకిలారావాల పంచమస్వరాలు.

అతను ఒక్కఎగురు ఎగిరాడు. విరగబడి నవ్వాడు.

"దొరికింది, దొరికింది."

ఆవిడ విస్మయానికి మేరలేదు.

"నా జీవిత సుందరి దొరికింది!" అతను గొంతు

తేశాడు. "సుందరీ, నీ బొమ్మే నేను చెక్కాలనుకున్నది. నా శిల్పసుందరీ, రా!"

"నా పేరు సుందరి కాదు. సరస్వతి!" ఆమె జంకింది.

"ఊఁహూఁ నీ పేరు సరస్వతి కాదు. సుందరే నువ్వు సుందరివే!" ఆమె ఏదో అనబోయింది. "ఊఁహూఁ ఇక దానికి తిరుగులేదు."

"సుందరీ" ఆమె హృదయంలో అతని మధుర స్వనం మారుమ్రోగింది.

"నువ్విక్కడ కూచో."

ఆవిడ కూచుంది.

"నువ్విటు చూడు."

ఆవిడ చూసింది.

రెండుజతల కళ్లు కలిసి జిగేలుమన్నాయ్.

అతను బొమ్మ చెక్కటం మర్చిపోయాడు, ఆ సౌందర్య దేవతను నేత్రాలద్వారా ఆస్వాదించటంలో.

"బొమ్మ చెక్కుతానంటిరే!" జ్ఞాపకంచేసింది సుందరి.

"ఔనౌను. బొమ్మ చెక్కాలి" అతనికి స్ఫురించింది. "ఇటు చూడు. ఈవైపుకు కాస్త ఇటు... ఈ రాధాకృష్ణుల బొమ్మవైపుకు. ఆఁ. అలాగే!"

ఆవిడ అలా కూచుంది.

"ఇహ వెళ్లొస్తాను." సుందరి అంది.

"ఊఁ ఎక్కడికి?"

"ఇంటికి."

"ఇది ఇల్లుకాదూ?"

ఆమెకు ఏమనాలో తెలీలేదు.

"నువ్వక్కడే ఉండిపో. మనమిద్దరమూ హాయిగా ఈ కళాజగత్తులో విహరించవచ్చు."

సుందరితోపాటు తన జీవిత మందహాసం కూడా పారిపోయిందా అనిపించిందతనికి! క్షణం ఒక యుగంగా గడిచింది.

మళ్లీ సుందరి వొచ్చింది.

"ఇహ వెళ్ళవ్ గదూ?"

"..........."

అతను రాధాకృష్ణుల సాక్షిగా పాణిగ్రహణం చేశాడు!

సుందరి శిల్పసుందరిగా తయారైంది.

* * *

ఆనందరావు రాధాకృష్ణుల బొమ్మను ఒక తటూ సుందరిని ఒక తట్టూ ఆరాధిస్తున్నాడు.

సుందరి గొప్ప రచయిత్రి. సుందరి కథలు ఆనందరావులో క్రొత్త చైతన్యాన్ని కలిగించినై.

ఆనందరావు జీవితాన్నే ఇతివృత్తంగా తీసుకుని సుందరి కథ రాసింది. అది చదివి వినిపించి అడిగింది. "ఆ మధుర క్షణం ఇంకా జ్ఞాపకం ఉంది కదూ? అప్పుడు నా అందానికి మురిసి, ఆ బొమ్మను చెక్కటం, అవన్నీ. రోజులు గడిచేకొద్దీ అందంచెడిపోతుంది. యవ్వనం అయిపోతుంది. చిట్టచివరికి అందవిహీనమైన శల్య దేహం మిగులుతుంది."

"అబ్బే. అందం రోజురోజుకూ వృద్ధి పొందుతుంది. అది ఎన్నటికీ అయిపోదు. అది ఒకఎడతెగని ఊట. అబ్బ, నిజానికి నువ్వు యివాళ యెంత అందంగా ఉన్నావ్! ఈ అందంలో అది ఒక లెక్కా?"

ఆనందరావు సుందరి పెదిమల మీద ఒక ముద్దును నాటాడు. ఆమెను విస్మయానందాలు ఆవరించినయ్.

"నిన్న అందంగా వున్నావ్. ఇవాళ మరీ, రేపు ఇంకా."

"పెళ్ళాడితే శిల్పినే పెళ్ళాడాలి." సుందరి అనుకుంది.

సుందరి కథల్లో మార్పు వొచ్చింది. ఆ రోజు నుంచీ సుందరి ఇతివృత్తాలువేరు. సుందరిభావాలు వేరు.

ఇవాళ, రేపు, ఎల్లుండి, ఆవలెల్లుండి, నెలలూ కాలాలూ వెళ్లిపోతున్నాయ్.

ఆనందరావు కళా ప్రపంచంలో కూచుని, సుందరి అందాన్ని చూసి మురిసిపోతూనే ఉన్నాడు.

"కేవలం శాకాహారంమాత్రమే తింటే సౌందర్యం వృద్ధి చెందుతుంది" అని వ్రాసిన అమెరికా స్త్రీకి ఒక పాఠకుడు యిలా ఉత్తరం వ్రాశాడు: మీరు హిప్పొపొటమస్ అనే జంతువు సౌందర్యంగురించి ఆలోచించారా?"